# ట్రిక్ ! ...

మా స్కూల్లో మాస్టర్లందరికీ రజని ఓ సమస్య అయిపోయింది. చదివేది ఎనిమిదో తరగతి. ఇంకా మూడేళ్ళపాటు ఆ పిల్లను భరించాలన్న ఆలోచనకు అదిరిపడని టీచరుండడు. ఇంతకూ ఆ అమ్మాయి ఎవరో చెప్పనే లేదు కదూ! సాక్షాత్తు మా ప్రధానోపా ధ్యాయుని గారాల పట్టి. ఆ పిల్లనేమైనా అంటే హెడ్మాస్టరుగారికి ఎక్కడ కోపం వస్తుందోనన్న భయం.

సి.యల్. దగ్గర నుంచి ఇంక్రిమెంట్ వరకు అన్నీ ఆయనే శాంక్షన్ చేయాలి మరి. అలా అని రజని పెంకి పిల్లేం కాదు. చదువులోను చురుకైందే.

ఎటొచ్చి ఆన్సర్ పేపర్లు చేతికిచ్చేటప్పుడు మార్కుల విషయంలో పేచీ పెడుతూ ఉంటుంది.

అదే మా అందరికీ పెద్ద తలనొప్పి. అదనంగా మార్కులు వెయ్యలేం. వెయ్యకుండా ఉండనూ లేం.

హెచ్.ఎమ్.గారి పాప కదా అని అడిగిందే తడవుగా ముందు వెనక చూడకుండా నాలుగేసి మార్కులు కలిపేస్తుంటారు మా సోషలు మాస్టారు. ఉత్తపుణ్యానికి మార్కులేయడం మా సైన్సు మాస్టార్‌కి అసలు ఇష్టం ఉండదు. అయినా అతగాడికి తప్పడం లేదు. రజని ప్రధానోపాధ్యాయుని కూతురా? మజాకా?...

మాస్టార్లందరినీ ఒత్తిడి చేసి ఏదో విధంగా అదనంగా మార్కులు వేయించుకునే రజని నా దగ్గర నోరు మెదపకపోవడం చూసి అంతా ఆశ్చర్యపోయారు. అందుకు నేను ప్రయోగించిన ట్రిక్కేమిటో చెప్పమన్నారు. నవ్వి ఊరుకున్నాన్నేను. అంతా అదే ట్రిక్ ప్లే చేస్తే దానికి విలువేం ఉంటుంది? మళ్లీ నా పరిస్థితి మొదటికి రాదూ! అయితే ఆ ట్రిక్కేమిటో మీకు మాత్రం చెప్పాలనుకుంటున్నాను. ఎవరితోను అనకండేం?

హాఫ్ ఇయర్లీ పేపర్లు ఇచ్చేటప్పుడనుకుంటాను రజనీకి కావాలనే నేను దిద్దిన పేపరు టోటల్ చేసేటప్పుడు ఐదుమార్కులు ఎక్కువ వేశాను. అయితే ఆ పిల్ల తనకు టోటల్‌లో ఎక్కువ మార్కులు పడిపోయాయన్న సంగతి చెప్పకుండా మరేదో ప్రశ్నకు రెండు మార్కులు కలుస్తాయంటూ పేచీ పెట్టింది.

“రెండు మార్కులే కదా! వేస్తాను తల్లీ నీకు కాకపోతే మరెవరికేస్తాను? ముందు టోటలు చూడని” అని ముద్దుగా చెప్పి “అరే, కూడిక తప్పింది. ఐదు మార్కులు ఎక్కువ పడిపోయాయి. లెక్కపెట్టలేదా? ముందు వాటిని మైనస్‌చెయ్యాలి” అని అన్నానో లేదో బిక్క మొహం పెట్టింది.

అంతే, ఆ రోజు లగాయితూ ఆన్సర్ పేపర్లు చేతికిచ్చేటప్పుడు మార్కుల కోసం ఆ అమ్మాయి నాదగ్గర కొస్తే ఒట్టు.

(2-10-2011 ఆంధ్రభూమి వారపత్రిక)